లొంగితే వ్యసనం మనిషిచేత చేయించలేని పనులు లేవు!

కె. రమణమ్మ

# వ్యవస్థ



అయ్యా పైసా ధర్మం చెయ్యండి.

అమ్మా పైసా ధర్మం చెయ్యండి తల్లీ. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గుడ్డ పర్చుకుని కూర్చున్నాడు మల్లిగాడు.

మూడు రోజుల నుంచి మల్లిగాడికి సుక్క పడలేదు. కనిపించిన ప్రతివాడిని సిగ్గు విడిచి అప్పడిగేడు. ఎక్కడా అప్పు పుట్టలేదు. అందుకే ఈ నీతిమాలిన పనికి దిగజారిపోయాడు. మల్లిగాడి తాత తండ్రుల దగ్గరనుంచి వస్తున్న వారసత్వమే మల్లిగాడి కొచ్చేసింది. వారు పొలం పుట్రవున్న వాళ్ళు కాబట్టి, సుక్కతోబాటు ప్రక్కనో చక్కని చుక్కని కూడా వుంచుకునేవారు. మల్లిగాడు చేతిలో నాలుగు రాళ్ళులేక ఒక్క సుక్కతోనే సరిపెట్టుకుంటున్నాడు- అంతే తేడా.

ఎండవేడికి ముఖమంతా చెమటలు పట్టేసేయి. మూడు రోజుల నుంచి సుక్క ళేదేమో మనిషిలో వుషారులేక డల్‌గా ఫీలవుతున్నాడు. మెదడు మొద్దుబారిపోయింది. వంట్లో చిరాగ్గా ఏదోలా వుంది. మల్లిగాడికి నాలుగు రోజులు తిండిలేకపోయినా ఫరవాలేదు, ఒక్కరోజు సారా లేకపోతే ఆర్నెల్లు జబ్బుపడిన వాడిలా అయిపోతాడు. సారానే తన ప్రాణం. వూపిరి. ఆయుస్సు, బ్రతుకు అనుకునే దేవదాసుల్లో మొట్ట మొదటివాడు.

అరచి అరచి గొంతు కెండిపోయింది.

నాలుక పిడచ కట్టుకుపోయింది.

అయినా ఇంకా అరుస్తూనే వున్నాడు.

అయ్యా, ధర్మం చెయ్యండి బాబూ.

"దుక్కలా వున్నావు కూలిపని చేసుకు బ్రతకూ్కడదూ" నవ్వుకుంటూ నేరొకట్ పేంటు మల్లిగాడి ముందునుంచి వెళ్ళిపోయేడు.

"మీబోటి పెద్ద సదువులోల్లే కూలిపనుల కెగబడుతుంటే అవి మాదాకా వస్తాయా బాబూ" అంటూ వెళ్ళిపోతున్న వాడివైపు చూస్తూ మల్లిగాడు ఫెళ్ళున నవ్వేడు.

అలా మధ్యాహ్నం మూడు గంటల వరకు అరుస్తూనే వున్నాడు. ఎవ్వరూ చిల్లిగవ్వ విదపలేదు. అడుక్కుంటే నాలుగు డబ్బులు చేరితే సాయంత్రానికి సుక్కేసుకోవా లనుకున్నాడు. కాని ఒక్క పైసా దొరకలేదు. ఆయాసమే మిగిలింది. దొంగ సచ్చినోడు ఆ మేస్త్రీగాడు ఆ సితాకోక సిలక్కి పనిచ్చి తనకు పనియ్యనీయకుండా చేసేడు. లేకపోతే తనేంటి? అడుక్కోడమేటి? పనిలో కెళ్ళినన్నాళ్ళు ప్రొద్దుగూకే సరికి మహారాజులా ఈ మల్లిగాడు మైకంలో తేలిపోయేవాడు.

నాభంనేదు. లేచి క్రింద పరచిన గుడ్డను తీసి ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుని చంకలో పెట్టుకున్నాడు.

అక్కడే నిలబడి ఒక్కసారి నాలుగు వైపులా కలయచూస్తూ ఏమి చెయ్యడమా అని ఆలోచించసాగేడు.

ఉన్నట్టుండి మెరుపులా మెరిసింది ఒక ఆలోచన. దొంగతనం చేస్తే. అదృష్టం బాగుంటే వారం రోజుల బత్తెం కిట్టొచ్చు.

అరె.... ఆ కిళ్ళీ బడ్డీకాడేమిటి అంత మంది జనం. అదేటి ఆ కుర్రాణ్ని పట్టుకుని నలుగురు బాదేస్తుండారు. జనం మూగిన స్థలానికి వెళ్ళేడు.

దొంగ వెధవ. ఈ నీచపు పనికి దిగక పోతే కూలిపని చేసుకు బ్రతక్కూడదూ అంటూ ఒకాసామి ఆ పిల్లాడి వీపు మీద నాలుగు వాయించేడు.

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ అనేకే ఫణినఃసంతి। భేకభక్షణ తత్పరాః।
ఏక ఏవహి శేషోయం। ధరణీ భరణక్షమః

కప్పలను మ్రింగడంలో ప్రజ్ఞగల పాములు ఎన్నో వున్నా. ఆదిశేషుడొకడే ఓర్పుతో యీ భూభారాన్ని మోయగల సమర్థుడై వున్నాడు.

(పాములన్నీ శేషప్రజ్ఞ కలవి కావుగదా)

కంఠస్థం చేయాలి

కూలిపని.. కూలిపని.. పాపం ఆ ఆసామికి కూలిపనికి కూడా ఈ కాలం గిరాకి పెరిగిపోయిందని తెలియదుకాబోలు. ఆ ఆసామి మాటలకు నవ్వొచ్చి సన్నగా నవ్వుకున్నాడు మల్లిగాడు.

ఇంతలో పోలీసొచ్చి ఆ కుర్రాడిని బర బరా లాక్కెళ్ళిపోయేడు. జనమంతా ఎవరి తోవను వాళ్ళు వెళ్ళిపోయేరు. అమ్మో! దొంగతనం సేసినా లాభంలేదు. పట్టుబడితే సుక్కేసుకోక ముందే జైల్లో కూకోవాలి. అనుకుంటూ పంచకొంగును బొడ్లో దోపుకుని గుడిసెవైపు త్వరత్వరగా నాలుగు అడుగులు వేసేడు.

"రంగీ ఒక రూపాయుంటే యియ్యే సుక్కేసుకొత్తాను. ఈ యేళ ఒంట్లో ఏమి బాగోనేదు."

"అట్టా అనడానికి సిగ్గునేదు. సుక్క- ఏ సుక్క. పెళ్ళీడుకొచ్చిన బొట్టె ఇంట్లో వుంది. దానికి పెళ్ళి సెయ్యాలి. ఒకయ్య సేతిలో ఎట్టాలి. ఒకింటిదాన్ని సెయ్యాలన్న గేనమైనా వుందా నీకు. ఎప్పుడూ తాగి తందనా లాడ్డమే నీకు సేతనవును" కోపంతో విరుచుకు పడింది రంగి.

"అట్టాగేనే. నానూ దాని యినయమే ఆలోసిత్తుండాను. సూద్దాంలే. దానికేటి."

"సూద్దాం అంటే కుదర్దు. ఈ యేడు దానిపెళ్ళి సేయాల్సిందే....అంతే...." చేపల పులుసుతో నాలుగు ముద్దలు మింగి తుండుగుడ్డను చంకలో పెట్టుకుని రంగికి సమాధాన మియ్యకుండా మళ్ళీ వీధిని పడ్డాడు మల్లిగాడు.

కల్లు పాకలో అందరూ సుక్కేసుకుని మైకంలో తేలిపోతున్నారు. జోగుతూనే ఏవేవో వాగుతున్నారు.

మల్లిగాడు పాకలో దూరేడు. గురవయ్యను అప్పు రాసుకుని గ్లాసుడు సారా యిమ్మన్నాడు. గురవయ్య కసురుతూ ఒక్క బొట్టు కూడా రాల్చనన్నాడు. దౌర్జన్యం చేస్తే లాభంలేదని సారా వాసనను ఒక్కసారి పీల్చేసి బయటకొచ్చేశాడు. ఆ తర్వాత కొంచెం దూరం నడిచి అలసట రావటంతో ఒక రాయిమీద చతికిలబడి ఏమి చెయ్యడమా అని ఆలోచిస్తూ వుండిపోయేడు.

బుర్ర గోక్కున్నాడు.

మాసిన గడ్డాన్ని ఒకసారి తడుముకున్నాడు. అప్పుడే పిచ్చాసుపత్రినుంచి



"వికసిత కుసుమం"

ఫోటో : పి. శ్రీనివాసస్వామి, బెల్లంపల్లి

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం 'డగ్ వినాశక్' వాడిన యెడల మూడు దినములలో మారును. ఆటుపైన మామూలు చర్మం వలె నుండిపోవును ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Kalpana Ayurved Bhawan,
Post. Katri sarai (Gaya)

రాజేశ్వరి ట్రేడర్స్

బొడ్డపాటివారివీధి, గాంధీనగరం, విజయవాడ-3

గెలవండి! రు. 15000/-లు

1 కూపను రు. 1/-; 10 కూపన్లు రు. 8/-; 20 కూపన్లు రు. 15/-.

| | | | |
|---|---|---|---|
| జ | | | |
| | | రె | |
| | | తి | × |

గడిలోని ఆర్టిస్టుల పేర్లు సరెక్టుగా వ్రాసి I.P.O. గాని, M.O. రశీదుగాని జతపర్చి ఫలితములకు 0-40 పై. స్టాంపులు పంపండి. మా సొల్యూషన్‌కు సరిపోలని ప్రతిమాట ఒక తప్పుగా లెక్కించబడును.

ముగింపు : 31-10-77.

ఫలితం : 6-11-77 జ్యోతి డైలీలో.

ప్రతి 100 కూపన్లకు ఒక అలారం టైంపీసు.

వచ్చినవానిలా వుంది వాడి అవతారం.

'ఛీ! ఈ బతుకు బతికేకన్నా సస్తేనయం' అనుకున్నాడు.

"ఏటి మల్లిగా ఆలోసిత్తున్నావు?"

ఎదురుగా ఈరిగాడు. ఆరడుగుల భారీ విగ్రహం. ఆ వూరి మోతుబరి కొడుకు. వాడి మాటకు ఆ వూరిలో తిరుగేలేదు.

"ఏటి మల్లిగా అలా వున్నావు ఒంట్లో బాగోలేదా?" మళ్ళీ ఈరిగాడే అడిగేడు.

"మూడు రోజుల నుంచి సుక్కనేదు బాబుగారు. సుక్క నేపోతే నేను మనిసిని కాను."

"అయితే నా నొక పని సెప్తాను సేత్తావా?"

"సెప్పండి"

"నీ యిల్లు సారా దుకాణం సేత్తాను. నిన్ను సారాలో ముంచేత్తాను. ఆ తర్వాత అమురుతం సొరగం – దేవకన్నెలు. నీకు కావలసినంత డబ్బు."

"సెప్పండి బాబు ఏటి సెయ్యామంటారు."

"ఏటినేదు. నీ మంగిని.... అదే నీ బొట్టెని ఈ రేతిరికి నాకాడకు తోలేవంటే ఈ యేళతో నీ బాధలన్నీ పూర్తిగా తీరిపోయినట్టే."

"అట్టాగే బాబుగోరు" మల్లిగాడు అమాంతం ఈరిగాడి కాళ్ళమీద పడిపోయేడు.

* * *

"జగమే మాయ.

బ్రతుకే మాయ" పాడుకుంటూ గ్లాసు మీద గ్లాసు ఖాళీ చేసేస్తున్నాడు మల్లిగాడు.

నిముషాలు గంటలుగా మారిపోతున్నాయి.

"అయ్యో! నన్ను రచ్చించయ్యో. ఈ ముష్టి సచ్చినోడు.... అయ్యో నీవింత పనికి దిగజారుతా వనుకోలేదు అయ్యో ..."

"అయ్యో నేదు...గొయ్యోనేదు...ఎవరే నువ్వు....ఒల్లకుండు" మరో గ్లాసందుకున్నాడు.

"అబ్బ! అమురుతం....సొరగం....దేవకన్నెలు....ఎక్కడ. సక్కని సుక్కంటి కెళ్ళాలి....వెళ్ళాలి లేవబోయిన మల్లిగాడు మైకమెచ్చి గదిలో బోర్లా పడిపోయేడు.

"అయ్యో! రచ్చించయ్యో....నీ కాళ్ళకు దణ్ణం యెడతాను....అ....అ...."

మల్లిగాడు భూమిమీద స్వర్గాన్ని చూస్తున్నాడు.

కామాంధుని కబంధ హస్తాలలో నలిగిపోతున్న మంగి భూమిమీద నరకాన్ని చూస్తున్నది. ★

# వనితావని

## ప్లాస్టిక్ వైరుతో బుట్టలు



ఈనాడు ఎందరో మహిళలు కాలక్షేపానికి చేస్తున్న ప్లాస్టిక్ వైరుతో అల్లిక పని కొందరి జీవనోపాధికి కూడా తోడ్పడుతున్నది. మన యింట్లోకి అవసరం అయ్యే కొన్ని వస్తువులను మనమే స్వయంగా సమకూర్చుకోవచ్చు. కూరగాయల బుట్ట, పూజ సామాగ్రి సజ్జ, ఫ్లవర్‌వాజ్, హేండ్ బ్యాగ్ మొదలగునవి ఎన్నో మన ఆసక్తికి తగినట్లుగా తయారుచేసుకోవచ్చు.

పై ఫొటోలో వున్న పెద్ద బుట్టలకు ఒక్కొక్కదానికి రెండు కట్టల వైరు పడుతుంది. చిన్న సజ్జలకు ఒకటిన్నర పడుతుంది. మార్కెట్‌లో కొనాలంటే బుట్ట 15 రూపాయల వరకు వుంటుంది. మనమే అల్లుకుంటే కట్ట అయిదు రూపాయలకు వస్తుంది. బుట్టలకూ, సజ్జలకూ అడుగున వేసే బటన్లు నాలుగూ ఒక రూపాయి. మొత్తంలో 4 రూపాయలు ఆదా చేయటమేకాక ఎంతో కాలక్షేపానికి కూడా సహకరిస్తుంది. చిన్న సజ్జలకు హేండిలూ మరియు సజ్జపై చుట్టూ భాగము కలిపి సన్నటి యినుప చువ్వతో వెల్డింగు చేయించి ఆపైన వైరు అల్లికచేస్తే అందంగానూ, ఎక్కువ ధృఢంగానూ వుంటాయి. మిగిలిన ముక్కలు వృధా కాకుండా అన్ని రంగులతో కలిపి ఫ్లవర్‌వాజ్ చేసుకోవచ్చును.

ఫ్లవర్‌వాజ్ అడుగు భాగం నిలచుటకు సన్నని పాత తీగను మనం ఎంచుకొనే సైజు ప్రకారం గుండ్రంగా చేసి దానిచుట్టూ వైరు అల్లిక ప్రారంభించి ఒక అంగుళం పైన వెడల్పు ఆకారం వచ్చుటకు మాడిపోయిన ఎలక్ట్రిక్ బల్బు మధ్యలోవుంచి దానిచుట్టూ అల్లిక వచ్చిన పై ఆకారము రాగలదు. యింకా ఎక్కువ వెడల్పూ, పొడవూ కావాలనుకుంటే కిరోసిన్ లైట్లకు వాడే గాజు చిమ్నీలు పొడవువి మార్కెట్‌లో లభిస్తాయి. వైరు ముక్కలు జాయింటుకు గట్టి రంగుదారంతో ఒక కుట్టు వేస్తేచాలు. వైరు కట్టలు ఒకొకటి రెండు వందల గ్రాముల తూకంగలవి అయిదు రూపాయల వెలలో అన్ని రంగులలో లభిస్తాయి. అల్లినవి చూసి నేర్చుకొనుట కష్టమేకానీ, ఎవరైనా అల్లేటపుడు ఒకసారి చూస్తే నేర్చుకొనటం ఆసక్తిగలవారికి చాలా సులభం.

—కొత్త శశీదేవి